# ఎల్‌నినో ప్రభావం.. ప్రత్యామ్నాయ పంటలే మేలు





❖ వరి సాగుతో నష్టపోయే ప్రమాదం.. తక్కువ నీటి అవసరమున్న పంటల వైపు రైతులు మళ్లాలి
❖ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**దశ, చౌటుప్పల్:** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. గురువారం చౌటుప్పల్ మండలం మశీదుగూడెం గ్రామంలో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వర్షపాతం గణనీయంగా తగ్గిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, నీటి కొరత ఏర్పడే పరిస్థితుల్లో అధిక నీరు అవసరమయ్యే వరి సాగుతో రైతులు నష్టపోయే అవకాశం ఉందని హెచ్చరించారు.

**ఆయిల్‌పామ్, కూరగాయలు, పూల సాగుపై దృష్టి**

రైతులు సంప్రదాయ పంటలపైనే ఆధారపడకుండా ఆయిల్‌పామ్, కూరగాయలు, పూల తోటలు వంటి తక్కువ నీటి అవసరమున్న, లాభదాయకమైన పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్‌లో తాగునీటి అవసరాలు కూడా పెరిగే అవకాశం ఉన్నందున నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు.

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పి. వెంకట రమణ రెడ్డి రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుని భూములకు అనుకూలమైన పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి హేమలత ఆయిల్‌పామ్, కూరగాయల సాగు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను వివరించారు.

ఆయిల్‌పామ్ రైతులు కూసుకుంట్ల రామ్‌రెడ్డి, యాస రామకృష్ణారెడ్డి వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. రైతు జక్కిడి కొండల్‌రెడ్డి పెద్దకొండూరులో ఏర్పాటు కానున్న బయోగ్యాస్ ప్లాంట్‌కు అవసరమైన నేపియర్ గడ్డిని సాగు చేసి రైతులు ఆదాయం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో RDO శేఖర్‌రెడ్డి, DLPO డి. ప్రతాప్ నాయక్, ZP డిప్యూటీ CEO శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి ఎం. నాగరాజు, మశీదుగూడెం సర్పంచ్ మర్రి వంశీధర్‌రెడ్డి, మండల, గ్రామస్థాయి అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు.

## కారుపోతుల అంజన్న సేవలు చిరస్మరణీయం



**దశ, రామన్నపేట:** ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ప్రజా కళాకారుడు, ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజానాట్యమండలి మాజీ అధ్యక్షుడు కామ్రేడ్ కారుపోతుల అంజన్న 31వ వర్ధంతిని కక్కిరేణి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు గంటెపాక శ్రీకృష్ణ, మండల అధ్యక్షుడు బర్రె మధు మాట్లాడుతూ ప్రజా సమస్యలు, అన్యాయాలు, అసమానతలపై ప్రజలను చైతన్యపరిచేందుకు అంజన్న తన కళను ఆయుధంగా మలిచారని అన్నారు. ఆయన సేవలు ప్రజా కళాకారులకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మజ్జూరి సాయి, కానుకుంట్ల ఉప్పలయ్య, మచ్చగిరి, వెంకన్న, లింగస్వామి, చరణ్, లోకేష్, బూడిద ఆది తదితరులు పాల్గొన్నారు.

## జీవో 97ను రద్దు చేయాలి

❖ విద్యార్థులపై లాఠీచార్జ్ ఖండించిన డా. బూర నర్సయ్య గౌడ్



**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** జీవో నంబర్ 97ను రద్దు చేయాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడాన్ని మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. బూర నర్సయ్య గౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను పీపీపీ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయని అన్నారు. డిప్లొమా కోర్సులు, సర్టిఫికెట్ల గుర్తింపు, బీటెక్‌లో లేటరల్ ఎంట్రీ, ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడకుండా ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రస్తుత స్వరూపాన్ని కాపాడాలని, జీవో 97ను వెంటనే పునఃసమీక్షించి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రజాస్వామ్య నిరసనలను ప్రభుత్వం గౌరవించాలని సూచించారు.

## ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన



**దశ, చౌటుప్పల్:** ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని ఏఈఓ పల్లె వెంకటేశం సూచించారు. మందులగూడెం గ్రామంలో రైతులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పెసర, మినుము, ఉలవలు, నువ్వులు, జొన్నలు తదితర ఆరుతడి పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రేమ్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ (FFS) నూతన ఫర్టిలైజర్ యాప్పై రైతులకు అవగాహన కల్పించారు. ఎరువుల విక్రయాలు, సరఫరాకు సంబంధించిన వివరాలను యాప్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తంగళ్ల వెంకటేశం, ఉపసర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఓబీసీలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి: కల్పనా ఇనాందార్



**దశ, హైదరాబాద్:** జనాభా ప్రాతిపదికన సమగ్రత, ఓబీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, న్యాయ సంస్కరణలు, రాష్ట్రాల సమాఖ్య హక్కుల పరిరక్షణ కోసం 'లోక్ తాంత్రిక్ న్యాయ్ అభియాన్'ను ప్రారంభించినట్లు లోక్ ఆందోళన్ న్యాస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్పనా ఇనాందార్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యంగా ఆమె నాలుగు ప్రధాన డిమాండ్లను రాజకీయ పార్టీల ముందు వుంచారు. ఆగస్టు 31న ఈ నాలుగు అంశాల మీద ఇందిరా పార్క్ వద్ద ఉద్యమం మొదలవుతుందన్నారు. అంతేకాకుండా డీలిమిటేషన్, మహిళలకు 33% రిజర్వేషన్, కులాల సమాఖ్య న్యాయం, జనగణనలో ప్రత్యేక ఓబీసీ విభాగం, మహిళల రిజర్వేషన్లలో ఓబీసీ ఉపకోటా, న్యాయ నియామకాల్లో పారదర్శకత, స్థానిక న్యాయ ప్రతిభకు ప్రాధాన్యం వంటి అంశాలను ఆమె మాట్లాడుతారు. 2027 జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక, ప్రామాణిక విభాగాన్ని ఏర్పాటు చేసి కులాలు, ఉపకులాలను శాస్త్రీయ పద్ధతిలో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయ విధానాలకు కచ్చితమైన జనాభా గణాంకాలు అవసరమన్నారు. మహిళల రాజకీయ రిజర్వేషన్లలో ఓబీసీ ఉపకోటా కల్పించేలా రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. ఓబీసీ మహిళలకు రాజకీయాల్లో మరిన్ని అవకాశాలు కల్పించడంతో పాటు క్షేత్రస్థాయి మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించాలని అన్నారు. న్యాయ నియామకాల్లో పారదర్శకత, ప్రతిభ, సమాన అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అఖిల భారత న్యాయ సేవ (ఏఐజేఎస్)ను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. కింది స్థాయి న్యాయస్థానాల్లో స్థానిక భాష, ప్రాంతీయ న్యాయ పరిజ్ఞానం ఉన్న న్యాయ నిపుణులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డీలిమిటేషన్ వల్ల ఏ రాష్ట్రానికీ ప్రాతినిధ్యం తగ్గకుండా రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా పెరిగే లోక్‌సభ స్థానాలను రాష్ట్రాల ప్రస్తుత ప్రాతినిధ్యానికి అనుగుణంగా కేటాయించి దేశ సమాఖ్య రాజకీయ సమతౌల్యాన్ని కాపాడాలని కోరారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**దశ, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న జగన్ మోహన్, మార్కెట్ వైస్ చైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి తదితరులు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 18 ఏళ్ల యువతకు ఓటు హక్కు కల్పించడం, దేశాన్ని ఆధునిక సాంకేతికత వైపు తీసుకెళ్లడం వంటి రాజీవ్ గాంధీ సంస్కరణలను నాయకులు కొనియాడారు. అనంతరం 18 ఏళ్లు నిండిన యువతీ యువకుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరుద్దీన్, కందిమల్ల గోపాల్‌రెడ్డి, మోటే రమేష్, వనం చంద్రశేఖర్, సాల్వేర్ అశోక్, బొడ్డు సాలయ్య, గుత్తా నర్సిరెడ్డి, మొహమ్మద్ నాసర్, బండ అంజిరెడ్డి,జిల్లా వెంకటేశం, పిట్ట వెంకటరెడ్డి, మహమ్మద్ అక్రమ్, కోట సుధాకర్ ,బత్తుల నవీన్, ఆముద లక్ష్మణ్ ,పున్న అమరేందర్ ,ఏ పరమేష్, కొమ్ము రామస్వామి, గొరిగే శేఖర్, బండ లింగస్వామి, మోటే మహేష్ ,కేశవదాస్ ,వెంకటేష్ బొడ్డు, శంకరయ్య ,ఎండి మన్సూర్ అలీ, ఎండి అజార్ ,హరిబాబు, కొండ శేఖర్ గౌడ్ ,మహమ్మద్ రిజ్వాన్, మిర్జా ఈనాయతుల్లా బేగ్, చిర్రబోయిన నవీన్ ,గంగాపురం శంకర్ ,సహదేవ ,కక్కినేని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయాలి

❖ సీపీఎం పాదయాత్రను జయప్రదం చేయాలి: ఎం.డి. జహంగీర్

**దశ, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాగునీరు, తాగునీటి ప్రాజెక్టులకు తక్షణమే నిధులు కేటాయించి పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్ డిమాండ్ చేశారు. ఈ నెల 29, 30, 31 తేదీల్లో భువనగిరి నుంచి హైదరాబాద్ ఇందిరాపార్క్ వరకు నిర్వహించనున్న సీపీఎం పాదయాత్రను జయప్రదం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రామన్నపేటలో పాదయాత్ర కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్నా సాగునీటి ప్రాజెక్టులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సాగునీటి వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, మూసీ కలుషిత నీటిని పంటలకు వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. బస్వాపూర్, గంధమల్ల, చర్లగూడెం ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయడంతో పాటు ధర్మారెడ్డి, పిల్లాయిపల్లి కాలువల పనులను వేగవంతం చేయాలని కోరారు.

బస్వాపూర్ రిజర్వాయర్ ద్వారా రామన్నపేటకు గోదావరి జలాలు అందించాలని, ఆసిఫ్‌నగర్ కాలువను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులన్నింటికీ నిధులు విడుదల చేసి కాలపరిమితితో పనులు పూర్తి చేయాలని కోరారు. పాదయాత్రకు రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మద్దతు ఇవ్వాలని జహంగీర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్, కల్లూరి నగేష్, బావండ్లపల్లి బాలరాజు, నాగటి ఉపేందర్, తొలుపునూరి శ్రీనివాస్, అవనగంటి నగేష్, నీల అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.



## రేడీమిక్స్ ప్లాంట్ ఏర్పాటు నిలిపివేయాలి


❖ పంట పొలాలు, రైతుల జీవనోపాధికి ముప్పు: తహసీల్దార్‌కు వినతి



**దశ, రామన్నపేట:** చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో ఏర్పాటు చేయనున్న రేడీమిక్స్ ప్లాంట్‌ను నిలిపివేయాలని కోరుతూ స్థానిక రైతులు తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ప్లాంట్ ఏర్పాటుతో పరిసర పంట పొలాలు, రైతుల జీవనోపాధి, ప్రజలపై ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాంట్ నుంచి వెలువడే సిమెంట్, ఇసుక, రాళ్ల దుమ్ముతో గాలి కాలుష్యం ఏర్పడి పంటలపై ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు తెలిపారు. భారీ వాహనాల రాకపోకలతో గ్రామీణ రహదారులు దెబ్బతినడంతో పాటు ప్రజలు, విద్యార్థులు, రైతులకు ప్రమాదాల ముప్పు ఉంటుందని పేర్కొన్నారు. ప్లాంట్ నుంచి వెలువడే వ్యర్థాలు, మురుగునీరు వ్యవసాయ భూములు లేదా నీటి వనరుల్లోకి చేరితే నేల, నీటి నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. సుమారు వంద మంది రైతుల జీవనోపాధిపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున ప్లాంట్ ఏర్పాటును పునఃపరిశీలించాలని కోరారు. జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రాంతాన్ని పరిశీలించి పంట పొలాలు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గంట్ల మహేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గుత్తా లవకుమార్, పున్న రాజు, యాదగిరి, విరమల్లు, లింగారెడ్డి, ముత్తయ్య, రాములు, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలి

❖ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



**దశ, రామన్నపేట:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నింటినీ వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య మాట్లాడుతూ.. వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం నియామకాలు చేపట్టకపోవడంతో నిరుద్యోగ యువత తీవ్ర నిరాశకు గురవుతోందన్నారు. ఉద్యోగాల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న యువత వయోపరిమితి దాటిపోతున్నారని, ప్రభుత్వ శాఖల్లో సిబ్బంది కొరతతో ప్రజలకు సేవలు సక్రమంగా అందడం లేదని పేర్కొన్నారు. శాఖల వారీగా ఖాళీ పోస్టుల వివరాలను వెల్లడించి, వెంటనే నోటిఫికేషన్లు జారీ చేసి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగ భర్తీ హామీలను అమలు చేయాలని, నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు. ఖాళీల భర్తీపై ప్రభుత్వం స్పందించకపోతే నిరుద్యోగులను సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, కందుల హనుమంతు, కల్లూరి నగేష్, బావండ్లపల్లి బాలరాజు, నాగటి ఉపేందర్, అవనగంటి నగేష్, తోలుపునూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కమలాపూర్ డబుల్ బెడ్రూం ఇళ్లను సందర్శించిన కౌశిక్ రెడ్డి





**దశ, హుజురాబాద్:** కమలాపూర్ మండల కేంద్రంలో నిర్మించిన 394 డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే అర్హులైన పేదలకు కేటాయించాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రోజున డబుల్ బెడ్ రూములను సందర్శించిన కౌశిక్ రెడ్డి ఆయన మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో సుమారు రూ.20 కోట్ల వ్యయంతో ఈ డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారని, ఒక్కో ఫ్లాట్‌కు సుమారు రూ.5.04 లక్షల చొప్పున ఖర్చు చేశారని తెలిపారు. అదనంగా రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ, తాగునీటి వంటి మౌలిక వసతుల కల్పన కోసం ఒక్కో ఇంటికి రూ.1.25 లక్షల చొప్పున మొత్తం సుమారు రూ.4.92 కోట్లను కూడా మంజూరు చేశారని గుర్తు చేశారు.

ఇటీవల కమలాపూర్‌కు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌లు డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీని ప్రారంభిస్తూ వారం రోజుల్లో లబ్ధిదారుల పేర్లు ప్రకటించి ప్రొసీడింగ్స్ అందజేస్తామని చెప్పారని, కానీ పది రోజులు గడిచినా ఇప్పటి వరకు లబ్ధిదారుల జాబితా విడుదల చేయకపోవడం, ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. లబ్ధిదారుల పేర్లు ప్రకటించినా వారు నివసించే పరిస్థితి ప్రస్తుతం లేదని, గృహ సముదాయాల్లో రోడ్లు పూర్తికాలేదని, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదని, తాగునీటి సౌకర్యం లేదని, డ్రైనేజీ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, అనేక ఇళ్లలో అద్దాలు పగిలిపోయాయని, బాత్రూమ్‌లు, తలుపులు కూడా సరిగా లేవని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలను ఇళ్లలోకి పంపడం సరైన విధానం కాదన్నారు. కమలాపూర్‌తో పాటు గూడూరు, మరిపల్లిగూడెం ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని తెలిపారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయని, లక్షల రూపాయలు డిమాండ్ చేస్తున్నారనే ఆడియోలు కూడా బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి, అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ SC కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, కమలాపూర్ మండల సీనియర్ నాయకులు, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, సత్యనారాయణరావు, ఇంద్రసేనారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు నవీన్, లక్ష్మణ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాజేష్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఇప్పలగడ్డ గ్రామ సమస్యలను పరిశీలించిన జనగామ జిల్లా కలెక్టర్

**దశ, జనగామ:** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఇప్పలగడ్డ గ్రామపంచాయతీని సందర్శించి గ్రామంలోని మౌలిక వసతుల సమస్యలను పరిశీలించారు. గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ధరావత్ రాజమణి, సర్పంచ్ కుమారుడు ధరావత్ రాజు నాయక్ గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి రవాణా సౌకర్యం లేకపోవడం, ప్రధాన రోడ్డు అధ్వాన్నంగా ఉండటం, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, సీసీ రోడ్ల నిర్మాణం అవసరమని వివరించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులతో పరిశీలన జరిపించి అవసరమైన నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇట్టబోయిన సురేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జీవో 97పై పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన



- రద్దు చేయాలని జాతీయ రహదారిపై రాస్తారోకో
- సమస్య పరిష్కారానికి ప్రభుత్వం స్పందించాలని డిమాండ్

**దశ, అబ్దుల్లాపూర్‌మెట్ :** జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పాలిటెక్నిక్ విద్యార్థులు గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆందోళనలో పాల్గొన్నారు. జీవో 97 వల్ల తమ విద్యా అవకాశాలు, భవిష్యత్ ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందని విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జీవోను రద్దు చేసి, తమ సమస్యలపై విద్యార్థి సంఘాలతో చర్చించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు రహదారిని రెండు వైపులా దిగ్బంధించడంతో విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆందోళనను విరమించి రహదారి నుంచి తప్పుకోవాలని పోలీసులు చేసిన ప్రయత్నంతో విద్యార్థులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొంతసేపు తోపులాట జరిగినట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే క్రమంలో పోలీసులు లాఠీచార్జి చేశారని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలైనట్లు వారు తెలిపారు. అయితే లాఠీచార్జికి దారితీసిన పరిస్థితులు, గాయపడిన విద్యార్థుల సంఖ్యపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. ఆందోళనలో పాల్గొన్న కొంతమంది విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

జీవో 97పై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని, విద్యార్థుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని సమస్యను చర్చల ద్వారా పరిష్కరించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో ఎస్ఎఫ్ఐ నాయకులు గుండె శివకుమార్, శశితో పాటు విద్యార్థులు పునీత్, గౌస్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

*ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ: గండికోట కుమార్*

**దశ, ఓయూ:** మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా మాణికేశ్వరి నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డీసీసీ ప్రధాన కార్యదర్శి, వడ్డే ఓబన్న ఉత్సవ కమిటీ సభ్యుడు గండికోట కుమార్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి విద్యాపరంగా ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేసిన గండికోట కుమార్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి ప్రోత్సాహక కార్యక్రమాలు విద్యార్థుల్లో చదువుపై మరింత ఆసక్తిని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా మేదరి సైదులు



**దశ, త్రిపురారం:** నాగార్జునసాగర్ నియోజకవర్గం త్రిపురారం మండలం కంపసాగర్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు మేదరి సైదులును నల్లగొండ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడిగా నియమించారు. గతంలో ఆయన త్రిపురారం మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేదరి సైదులు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంకణాల నివేదితా రెడ్డి-శ్రీధర్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్, ఉపాధ్యక్షుడు ఆంకూరి నరసింహ, జిల్లా అధ్యక్షుడు బాకీ నరసింహ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఎస్సీ మోర్చాను మరింత బలోపేతం చేస్తూ, ఎస్సీల సమస్యల పరిష్కారానికి, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

# దివ్యాంగుల హక్కుల చట్టం అమలుకు చర్యలు చేపట్టాలి




**దశ, ఓయూ:** దివ్యాంగుల హక్కుల చట్టం-2016ను పోలీస్ శాఖలో సమర్థంగా అమలు చేయాలని కోరుతూ విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం తెలంగాణ రాష్ట్ర కమిటీ డీజీపీని కలిసి వినతిపత్రం సమర్పించింది. దివ్యాంగులకు చట్టబద్ధమైన ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, పోలీస్ శాఖలో దివ్యాంగులకు అనుకూలమైన పోస్టులను గుర్తించి 4 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరింది. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో దివ్యాంగుల హక్కుల చట్టం-2016లోని సెక్షన్లు 89, 91, 92పై అవగాహన కల్పించే బోర్డులు ఏర్పాటు చేయాలని ఫోరం విజ్ఞప్తి చేసింది.

దివ్యాంగులు పోలీస్‌స్టేషన్లకు ఫిర్యాదు చేసేందుకు వచ్చినప్పుడు వారి వైకల్యానికి అనుగుణంగా సహాయం అందించేలా పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కోరింది. అవసరమైన చోట సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రెటర్, సహాయక వ్యక్తి, అందుబాటులో ఉండే ఫిర్యాదు విధానం వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించింది. అలాగే ప్రతి జిల్లా కేంద్రంలో పోలీస్ అధికారులు, సిబ్బందికి దివ్యాంగుల హక్కులు-పోలీసుల బాధ్యతలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని, పోలీస్ కార్యాలయాలు, స్టేషన్లలో దివ్యాంగులకు అనుకూలంగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని కోరింది. దివ్యాంగులపై జరిగే వివక్ష, అవమానం, వేధింపులు, దౌర్జన్యాలు, హింసపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వ ఉద్యోగాల్లో బెంచ్‌మార్క్ దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ అమలు చేయడంతో పాటు, పోలీస్ శాఖలోని బ్యాక్‌లాగ్ ఖాళీలను ప్రత్యేక నియామక ప్రక్రియ ద్వారా భర్తీ చేయాలని ఫోరం డిమాండ్ చేసింది. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమయం కేటాయించి నెలకు ఒకసారి వారితో సమావేశం నిర్వహించాలని డీజీపీని కోరింది.

ఈ సందర్భంగా డీజీపీ సానుకూలంగా స్పందించి దివ్యాంగుల హక్కుల చట్టం-2016ను పోలీస్ శాఖలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. అశోక్ తెలిపారు. దివ్యాంగులకు రక్షణ, గౌరవం, సమానత్వం, ఉపాధి అవకాశాలు కల్పించడంలో తెలంగాణ పోలీస్ శాఖ దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుర్షిద్ మియా, మహిళా అధ్యక్షురాలు ధనమ్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, సభ్యుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## చిరంజీవి జన్మదిన వేడుకల్లో మొక్కలు నాటి.. అన్నదానం.



**దశ, పెద్ద అంబర్‌పేట్:** మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదినాన్ని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ మండల చిరంజీవి యువత అధ్యక్షుడు బల్లెపు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట్‌లోని బధిరుల ఆదర్శ పాఠశాలలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల చేత కేక్ కట్ చేయించి, వారితో మొక్కలు నాటించారు. అనంతరం విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బల్లెపు సతీష్ కుమార్ మాట్లాడుతూ.. మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మొక్కలు పెంచడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. చెట్ల పెంపకం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ మోడేపు సత్యనారాయణ గౌడ్, డాక్టర్ సత్యనారాయణ, సీతారాం నాయక్, వెంకటేశ్వర్లు, నరసింహ, మేడి జ్ఞానేశ్వర్, విఘ్నేశ్వర్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు రమేష్, నాగలతతో పాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు



**దశ, చౌటుప్పల్:** రాజకీయాల్లో విజయాలు సాధించినట్లే, నూరేళ్ల వైవాహిక జీవితంలోనూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి-లక్ష్మీ దంపతులు కలకాలం సుఖసంతోషాలతో వర్ధిల్లాలని చౌటుప్పల్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ బాబా షరీఫ్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాక్షేత్రంలో అడుగులు వేస్తూ ప్రజల కోసం నిరంతరం సేవలందిస్తున్న గౌరవనీయులైన నేత దంపతులు ఇంటా, బయటా ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. వారి దాంపత్య జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండాలని కోరుకుంటూ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి



**దశ, హైదరాబాద్ :** కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జీ. కిషన్ రెడ్డి ని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు ఆత్మీయంగా పలకరించుకుని కొద్దిసేపు ముచ్చటించారు.

## పాలనలో పారదర్శకతకు ఆర్‌సీయూఈఎస్ సాఫ్ట్‌వేర్ మాడ్యూల్




**దశ ఓయూ:** పాలనలో పారదర్శకత, జవాబుదారీతనంతోపాటు ఖాతాల నిర్వహణను సులభతరం చేసేందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్రాంతీయ పట్టణ, పర్యావరణ అధ్యయన కేంద్రం (ఆర్‌సీయూఈఎస్) చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఆర్‌సీయూఈఎస్ రూపొందించిన *'అకౌంట్స్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ మాడ్యూల్'*ను ఓయూ ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ మొలుగరం గురువారం ప్రారంభించారు. బడ్జెట్ రూపకల్పన, వ్యయాల పరిశీలన, నిధుల నిర్వహణ, ఆడిట్ ప్రక్రియలు, రికార్డుల డిజిటలైజేషన్‌తోపాటు అన్ని ఆర్థిక కార్యకలాపాలను సులభతరం చేసేలా ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. దీని ద్వారా కాగిత రహిత, పారదర్శకమైన రియల్‌టైమ్ అకౌంటింగ్ వ్యవస్థకు మార్గం సుగమం కానుంది. వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడంతోపాటు జవాబుదారీతనం పెంపొందించేందుకు ఇది దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం మాట్లాడుతూ.. సుపరిపాలనకు ఖాతాల డిజిటలైజేషన్ ఎంతో అవసరమన్నారు. నూతన మాడ్యూల్ ఆర్థిక ప్రక్రియల్లో దక్షత, పారదర్శకత, ఖచ్చితత్వాన్ని పెంచుతుందని తెలిపారు. సిబ్బంది, యాజమాన్యానికి సకాలంలో సమగ్ర సమాచారం అందించడం ద్వారా విద్య, పరిశోధన రంగాలపై మరింత దృష్టి సారించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ప్రాజెక్టులు, గ్రాంట్ల నిధుల ప్రాసెసింగ్‌ను వేగవంతం చేయడంతోపాటు మాన్యువల్ పనిభారాన్ని తగ్గించే విధానాన్ని ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ సాంకేతిక విధానం ఇతర విభాగాలు, సంస్థలకు ఆదర్శంగా నిలుస్తుందని వీసీ ఆశాభావం వ్యక్తం చేశారు.